క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



కురవి: మండలంలోని రాజోలు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం అల్ల రవికుమార్, పీఈటీ దార్ల సునీల్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈనెల 4వ తేదీన మహబూబాబాద్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా బేస్‌బాల్ అండర్-14, అండర్-17 బాలుర విభాగంలో మాలోత్ లోకేష్‌నాయక్, వాంకుడోత్ వినయ్ అత్యంత ప్రతిభ కనపరిచినట్లు తెలిపాడు. వీరు ఈనెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు తొర్రూరులో జరుగు పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

ఆలయానికి నోట్ల లెక్కింపు యంత్రం బహూకరణ



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయానికి ఏపీలోని విజయవాడ నగర పరిధిలోని పరిటాలకు చెందిన డి.ఉమామహేశ్వరరావు అనే భక్తుడు నోట్లు(డబ్బులు) లెక్కించే యంత్రాన్ని శుక్రవారం ఆలయ అధికారులకు బహూకరించారు. రూ.7వేల విలువైన యంత్రాన్ని ఆలయ ఈఓ సత్యనారాయణకు అప్పగించాడు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ నందనం కవిత, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై ఫిర్యాదు



మరిపెడ: పౌర సరఫరాల సంస్థకు కేటాయించిన గోదాం భూమి అన్యాక్రాంతం అయిందని అట్టి భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని సర్వేనంబర్ 295/2లో పౌరసరఫరాల సంస్థకు ఎకరం రెండు గుంటల భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు. దీనిని కొంత మంది దళారులు ఆక్రమించుకొని ప్రహరీ నిర్మించుకున్నారన్నారు. ఇట్టి భూమికి హద్దులు నిర్ణయించి పూర్తిస్థాయిలో సర్వే చేసి అన్యాక్రాంతం అయిన భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ రషీద్, యాకన్న, దయాకర్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ



కురవి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను శుక్రవారం ప్యానల్ బృందం తనిఖీ చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం డీసీఎస్ శర్మ తెలిపాడు. ప్యానల్ గెజిటెడ్ హెచ్‌ఎం పి.గాంగునాయక్ ఆధ్వర్యంలో ప్యానల్ బృందం సభ్యులు రికార్డులను, పాఠ్య ప్రణాళిక ఆధారంగా బోధన సరళిని పరిశీలించారు. కార్యక్రమంలో శ్రీలత, రమాదేవి, సరస్వతీ, లక్ష్మీ, వీరస్వామి, పూల్‌సింగ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, హెచ్‌డబ్ల్యూఓ పద్మ, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎం పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు పెంపొందించాలి

పెద్దవంగర: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించాలని చిట్యాల కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎర్రోజు విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నవంగర ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. విద్యార్థుల పురోగతిని ప్రతినెల సాంకేతికంగా నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, బోధన ప్రక్రియలో వినూత్న పద్ధతులు అమలు చేయాలని పేర్కొన్నారు.

పట్టణ అధ్యక్షుడిగా నాగరాజు



గూడూరు: గూడూరు పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వడ్డెరగూడెనికి చెందిన వల్లెపు నాగరాజు, ఎస్సీ కాలనీకి చెందిన హెచ్ శివను పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తున్నట్లు శుక్రవారం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కంకర అయ్యప్పరెడ్డి ఒక ప్రకటనలో తెలిపాడు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- కొనసాగుతున్న గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె



కేసముద్రం: సబ్ పోస్ట్‌మాస్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు

కేసముద్రం: గ్రామీణ తపాలా ఉద్యోగులను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీనియర్ యూనియన్ నాయకులు, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ పింగిలి మల్లయ్య డిమాండ్ చేశారు. దేశవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో గ్రామీణ తపాలా ఉద్యోగులు అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ తపాలా ఉద్యోగులకు నాలుగు గంటల పని అని చెప్పి, రోజు మొత్తం పనిచేయించుకుంటూ శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా న్యాయమైన డిమాండ్‌లను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. అనంతరం సబ్‌పోస్ట్ మాస్టర్ రాములుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు శ్రీనివాసాచార్యులు, సుధాకర్, మొయినుద్దిన్, సుల్తానా, జనార్దన్, కమల్, సుమన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు టీజేఎస్ మద్దతు

గార్ల: గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ గిరిజన సంఘం జిల్లా నాయకులు బి.హరినాయక్ తెలిపాడు. గార్ల పోస్టాఫీస్ ఎదుట సమ్మె చేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె శుక్రవారానికి 4వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. తపాలా ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించి, వారిని కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు శాంతికుమార్, పూల్‌సింగ్, శ్రీనునాయక్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.



గార్ల: గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న టీజేఎస్ నాయకులు

మెరుగైన వైద్య సేవలు అందించాలి

సాక్షి ఎఫెక్ట్..

గార్ల: 'సమయపాలన పాటించని సిబ్బంది' అనే శీర్షికన రెండు రోజుల క్రితం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌ఓ) అంబరీషా స్పందించారు. శుక్రవారం మండలంలోని ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశాడు. తొలుత కేంద్రంలోని వైద్యసిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. వైద్యులు, వైద్యసిబ్బంది విధిగా సమయపాలన పాటించి ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించాడు. తనిఖీ సమయంలో విధులకు హాజరు కాని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇది మొదటి తప్పుగా వదిలేస్తున్నానని, మరోసారి విజిట్‌కు వచ్చినప్పుడు సమయపాలన పాటించని సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తప్పవని సిబ్బందిని డీఎంహెచ్‌ఓ హెచ్చరించాడు. అనంతరం పీహెచ్‌సీలో గర్భిణిలకు న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. అనంతరం మండలంలోని గార్ల, మర్రిగూడెం, పుల్లూరు పంచాయతీల్లో గల సబ్ సెంటర్లను తనిఖీ చేశాడు. ఆయన వెంట సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, డాక్టర్ రవి, హెచ్‌ఈఓ శ్రీహరి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



ఆస్పత్రి అధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ అంబరీషా

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు జరిగేలా చూడాలి



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

నెహ్రూసెంటర్: ప్రభుత్వ ఆస్పతిలో ప్రసవాలు జరిగేలా చూడాలని అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అర్బన్ పీహెచ్‌సీలో జాతీయ వైద్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. గర్భిణిలను 12వారాల లోపు రిజిస్ట్రేషన్ చేసిన వారికి మొదటి, రెండో విడత అర్బన్ పీహెచ్‌సీలో న్యూట్రిషన్ కిట్లను అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవించేలా గర్భిణిలకు సూచించాలన్నారు. డిసెంబర్ 31లోపు క్షయ, మలేరియా కార్యక్రమాలను వందశాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ మాస్ మీడియా ఆఫీసర్ కేవీ రాజు, సీహెచ్‌ఓ కృష్ణార్జునరావు, ఆరోగ్య విస్తరణ అధికారి రామకృష్ణ, పీహెచ్‌ఎన్ వసంత, సూపర్‌వైజర్లు రత్నకుమారి, పుష్పలీల, పీడీఎంలు కిరణ్మయి, నర్మద, రమ్య పాల్గొన్నారు.

గిరిజన కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి

గూడూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఏజెన్సీ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లెం కోటి కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం రాష్ట్ర ప్రచార కార్యదర్శి తాటి మధు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018లో ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయలేదన్నారు. పైగా ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులను కూడా జీఓ నంబర్ 145 ప్రకారం గౌరవించకుండా నిర్వీర్యం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికారంలోకి వచ్చిన వెంటనే జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దబ్బకట్ల సుమన్ పాల్గొన్నారు.

ఉద్యమంలో పాలుపంచుకోవాలి

నెహ్రూసెంటర్: ఎస్సీ వర్గీకరణ అంశం చివరిదశలో ఉందని, వర్గీకరణ ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్ అన్నారు. ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. వర్గీకరణ ఉద్యమంలో మాదిగలందరూ పాలుపంచుకోవాలన్నారు. ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా, మండల నూతన కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపాడు. కార్యక్రమంలో శాగంటి రమేష్, అనిల్, శంకర్, కత్తుల రేణుక, బిక్షపతి, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాలికల హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న సునంద

గూడూరు: నేటి ఆధునిక సమాజంలో ఆడ పిల్లలు ధైర్యంగా ఎదుగుతూ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని షీ టీం ఎస్సై సునంద అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా ఎస్పీ సంగ్రామ్‌సింగ్ ఆదేశం మేరకు అడిషనల్ ఎస్పీ చెన్నయ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆపద సమయంలో డయల్ 100, షీ టీం నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఏదైన ఇబ్బందికర సమయంలో షీ టీం నంబర్‌తో పాటు వాట్సాప్ నంబర్స్ 87126 56935, 790114 22009లకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయిబాబా, రవీందర్‌రెడ్డి, ఏఎస్సై ఆనందం, శ్యాంసుందర్, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్, బుల్లెట్ కాట్ పీసీ ఐలయ్య, నవీన్, షీ టీం కానిస్టేబుల్ రమేష్, పార్వతి, ఊర్మిల, భరోసా లాయర్ సాహిత్య పాల్గొన్నారు.

మట్టి అక్రమ వ్యాపారంపై ఫిర్యాదు



జేసీబీని అడ్డుకున్న గ్రామస్తులు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామం నుంచి అక్రమ తరలిస్తున్న రేగడి మట్టి వ్యాపారాన్ని అరికట్టాలని అదే గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు అధికారులను డిమాండ్ చేశారు. ఈసందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలోని బోడతండాలో అక్రమంగా నిల్వ చేసిన రేగడి మట్టిని జేసీబీ, ట్రాక్టర్ల ద్వారా ఇటుకబట్టీలకు తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్లను శుక్రవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఇరిగేషన్, తహసీల్దార్, పోలీస్ తదితర శాఖల అధికారులకు వారు ఫిర్యాదు చేశారు. అనంతరం గ్రామస్తులు జికల ఉపేందర్, షరీఫ్, చిన్నా, ఉప్పి, అలువాల శ్రీనివాస్, బోడ సోమన్న, బోడ బాలు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ వార్డు సభ్యుడు కట్ల రవీందర్ జేసీబీ ద్వారా రేగటి మట్టి అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్నాడని వారు ఆరోపించారు. ట్రాక్టర్ల ద్వారా రేగడి మట్టిని రూ.1800 ట్రిప్పు చొప్పున ఇటుకబట్టీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నాడని ఆరోపించారు.

అదనపు కట్నంకోసం వేధింపులు

- భర్త, అత్తమామపై పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు



తల్లిదండ్రులతో కలిసి మాట్లాడుతున్న బాధితురాలు శృతిబాయి

గార్ల: అదనపు వరకట్నం కోసం తరచూ వేధింపులకు పాల్పడుతున్న భర్త, అత్తమామ, ఆడబిడ్డలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గిరిజన వివాహిత శృతిబాయి జిల్లా పోలీస్ అధికారులను కోరారు. శుక్రవారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితురాలు మాట్లాడారు. గార్ల మండలం అంజనాపురం గ్రామానికి చెందిన తనకు, వరంగల్ జిల్లాకు చెందిన పోలీస్ ఉన్నతాధికారి కుమారుడు శంకర్‌తో 2020 సంవత్సరంలో వివాహం చేసుకున్నాడు. 3నెలలు వీరి కాపురం సజావుగా కొనసాగింది. తర్వాత భర్త ఉన్నత చదువు, ఉద్యోగం కోసం లండన్ వెళ్లాలని, ఇందు కోసం రూ.50 లక్షలు అదనపు కట్నం తీసుకురమ్మంటూ తరచూ భర్త, అత్తమామ, ఆడబిడ్డలు శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేశారని బాధితురాలు శృతి తెలిపింది. పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీలు పెట్టినా భర్తలో ఎలాంటి మార్పు రాలేదు. అదనపు కట్నం తేకపోతే విడాకులు ఇవ్వమంటూ భర్త తనను ఇబ్బందులు పెట్టేవాడని, మాకు ఆస్తి ఎక్కువగా ఉన్నందున వరకట్నం ఇచ్చే మరో అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని భర్త వేధించేవాడని పేర్కొంది. ఈనెల 6న గార్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. గార్ల ఎస్సై బానోత్ వెంకన్నను వివరణ కోరగా శృతిబాయి భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు తెలిపాడు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

నర్సింహులపేట: అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశాడు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన మండలస్థాయి సీపీఎం కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలతోపాటుగా నిరుద్యోగులకు ఉద్యోగభృతి, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, కొత్త రేషన్ కార్డులు తక్షణమే అమలు చేయాలని, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ తీసుకురావాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఏర్పాటు చేయాలని సూచించారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీరయ్య, మోహన్, కాయిత వీరయ్య, సోమిరెడ్డి, వెంకన్న, సుధాకర్, మల్లయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్టీసీ బస్సుల్లో జీరో టికెట్లు ప్రారంభం

నెహ్రూసెంటర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకం ద్వారా ఉచితంగా మహిళలకు బస్సులో ప్రయాణం సందర్భంగా జీరో టిక్కెట్లను ప్రారంభించినట్లు డీఎం ఎం.శివప్రసాద్ శుక్రవారం తెలిపాడు. తప్పకుండా తమ వెంట గుర్తింపు కార్డులు తీసుకురావాలని సూచించాడు.

బడిబయటి పిల్లల గుర్తింపు

తొర్రూరు రూరల్: మండలంలోని 29 గ్రామాల్లో జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడికి పంపించే కార్యక్రమాన్ని శుక్రవారం కొనసాగించారు. ప్రధానంగా సీఆర్‌పీలు వీణ, కల్పన, రాధిక, భాస్కర్, రమేష్‌లు ఆధ్వర్యంలో బడికి వెళ్లని పిల్లలను గుర్తించారు.

కేసముద్రం: బడీడు పిల్లలను బడికి పంపించాలని సీఆర్‌పీ ఉదయ్, పంచాయతీ కార్యదర్శి వినయ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కల్వల గ్రామంలో ఓఎస్‌సీ సర్వేలో భాగంగా ఇంటింటికి వెళ్లగా, ఇళ్లకు తాళాలు వేసి ఉండడంతో నేరుగా పంటక్షేత్రాలకు వెళ్లి పిల్లల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నర్సరీల పరిశీలన

దంతాలపల్లి: మండలం కుమ్మరికుంట్ల, దొనకొండ గ్రామాల్లో ఎంపీడీఓ విజయలక్ష్మి శుక్రవారం నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్తగా ప్రారంభిస్తున్న పనుల్లో మట్టిశాతం గురించి ఆరా తీశారు.

రైతుల ఆందోళన

నర్సింహులపేట: మండలంలోని బొజ్జన్నపేట శివారు భీమ్లతండాలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి వారం రోజులవుతున్న విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని శుక్రవారం రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వరి నార్లకు, మిరప తోటలకు నీళ్లు లేక ఎండిపోతున్నాయని తెలిపారు. అధికారులు వెంటనే మరమ్మతు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు సర్వన్, రైతులు సురేష్, నాను, మగతా పాల్గొన్నారు.

రుణమాఫీ అమలు చేయాలి

బయ్యారం: అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2లక్షల రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చారని, వెంటనే అమలు చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య శుక్రవారం డిమాండ్ చేశాడు. సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్లు, వెంకన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ రావడంపై హర్షం

దంతాలపల్లి: డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్‌ను ప్రభుత్వ విప్‌గా నియమించడంపై మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మండల అధ్యక్షుడు బట్టునాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు చిన్న రామన్న, బాలాజీ, కొమురవల్లి, రామ్‌రెడ్డి, కొమ్ము వాసు పాల్గొన్నారు.

కురవి: రాంచంద్రునాయక్‌కు ప్రభుత్వ విప్ పదవి దక్కడం అభినందనీయమని మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం తెలిపాడు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు ఎర్రనాగేశ్వర్‌రావు, మండల నాయకులు రాజేందర్‌కుమార్ ఉన్నారు.

సీఎంను కలిసిన నెహ్రూనాయక్



పెద్దవంగర: సీఎం రేవంత్‌రెడ్డిని డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్ సోదరుడు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జాటోతు నెహ్రూనాయక్ శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశాడు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపాడు.

అన్నదానం

తొర్రూరు: అన్నదానం మహాదానమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. కాంగ్రెస్ నాయకుడు హనుమాండ్ల తిరుపతిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పార్టీ యువ నేత తూనం శ్రావణ్ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలో మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పెదగాని సోమయ్య, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు వల్లబాయి పటేల్

తొర్రూరు: జాతీయ సమైక్యతకు కృషి చేసిన వల్లబాయి పటేల్ అందరికి ఆదర్శప్రాయుడని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు యాప సీతయ్య అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో సర్దార్ వల్లబాయి పటేల్ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, నాయకులు యాకయ్య, రాజేష్, కాగు నవీన్, జలగం రవి, చలపతిరాజ్, గంధం రాజులు పాల్గొన్నారు.

బెల్లం లారీ పట్టివేత

మహబూబాబాద్ రూరల్: సూర్యాపేట జిల్లా కోదాడలో బెల్లం లారీ పట్టుబడగా ఆ బెల్లం రవాణాకు సంబంధించిన వ్యాపారీ పరారీలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. కాగా సదరు బెల్లం లారీని మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యాపారీ తీసుకువస్తున్నట్లు తెలిసింది. నాలుగు రోజుల క్రితం కోదాడ శివారులో బెల్లం లారీని పట్టుకోగా అందులో ఉన్న బెల్లం వ్యాపారీ అక్కడి నుంచి పరారైనట్లు, అతడి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిసింది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రముఖ వ్యాపారీ పీడీఎస్ బియ్యం, అంబర్లు, గుట్కాలు, నల్లబెల్లం, పటీక క్రయవిక్రయాలు జరుపగా కొంత కాలం పాటు ఆ వ్యాపారాన్ని నిలిపివేశాడు. మళ్లీ ఇటీవల కాలంలో నల్లబెల్లం వ్యాపారాన్ని మొదలు పెట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు చుట్టూప్రక్కల గ్రామాలకు, తండాలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. దీంతో పోలీసులు పరారైన వ్యాపారీ కోసం గాలిస్తున్నారని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చర్చ జరుగుతుంది.

మంత్రులకు అభినందనల వెల్లువ



గూడూరు: మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీడీపీఓ



తొర్రూరు: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

గంగారం/గూడూరు: రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క)ను గంగారం మండలంలోని మడగూడెం గ్రామానికి చెందిన, విద్యుత్ శాఖ మహబూబాబాద్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ జనగాం నరేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. గూడూరు ఐసీడీఎస్ సీడీపీఓ నీలోఫర్ అజ్మీ ప్రాజెక్టు ప్రతినిధులతో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శి తిరుపతమ్మ, రఫియాబేగం, మంజుల, పద్మ పాల్గొన్నారు.

గార్ల: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రిగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన భట్టి విక్రమార్కను గార్లవాసి ఇల్లెందు ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం ఏ జలీల్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపాడు.

మరిపెడ రూరల్: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును మరిపెడ మండలం తాళ్లఊకల్ గ్రామానికి చెందిన ఏవన్ కాంట్రాక్టర్ కొంపెల్లి శ్రీధర్‌రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశాడు. అదేవిధంగా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనయ్యలను కలిసి శ్రీధర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపాడు. శ్రీధర్‌రెడ్డి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు నూకల శ్రీరంగారెడ్డి ఉన్నాడు.



మంత్రి తుమ్మలకు పుష్పగుచ్ఛం ఇస్తున్న శ్రీధర్‌రెడ్డి

తొర్రూరు: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర మంత్రులను తొర్రూరు ప్రాంత మాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు ధనసరి సీతక్క, దామోదర రాజనర్సింహ, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్‌లను కలిశారు. కార్యక్రమంలో మాల మహానాడు పొలిట్ బ్యూరో చైర్మన్ భాస్కర్, జిల్లా అధికార ప్రతినిధి చిట్టిమల్ల మహేష్, డివిజన్ అధ్యక్షుడు గొడిశాల నవీన్, నాయకులు యనమల రాకేష్, సంజీవ పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణ చర్యలు అభినందనీయం

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని చెరువుల పరిరక్షణ కోసం హైకోర్టు ఆదేశాలు జారీ చేయడం అభినందనీయమని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం సభ్యులు సింగని అశోక్, దశరథం, ఊశయ్య, ఉపేందర్, నాగన్న, రవి, వెంకన్న అన్నారు. మహబూబాబాద్‌లోని నిజాం చెరువు ప్రాంతంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మైనార్టీ విద్యార్థులు



తొర్రూరు: రాష్ట్ర స్థాయి హాకీ, బేస్‌బాల్ పోటీలకు స్థానిక మైనారిటీ బాలికల గురుకులం విద్యార్థులు ఎంపికయ్యారు. తొర్రూరులో జరిగే అండర్-14 విభాగం బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎస్కే షహరీన్, నందినిలు, కామారెడ్డి, వనపర్తిలో జరిగే అండర్-17 విభాగం రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు మేఘన, మానస, రేవతి, సంజన, శ్రావిక ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ పి. వనజ, పీఈటీ ఉమలు అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ రుహీనా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.